క్లుప్తంగా

ఎమ్మెల్సీ సత్యంకు సన్మానం


సత్యంను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత మిర్యాలగూడకు మొదటిసారిగా వచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఎండీ.సయ్యద్, జిల్లా యాదగిరి, వల్లంపట్ల వెంకన్న, బంటు రాజేశ్వరి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నందికొండ అధ్యక్షుడిగా రాజు

నాగార్జునసాగర్ : భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నందికొండ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడిగా ఎర్రబోయిన రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండలో నిర్వహించిన వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాలకు హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రాజుకు నియమాకపత్రాన్ని అందజేశారు. వీరికి స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తడకమళ్ల జంక్షన్ రోడ్డులో ఎస్‌వీకె కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనులను నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు వేసవి దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ వెంకన్నలతో పాటు పలువురు తదితరులున్నారు.

ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆర్టీసీ సమ్మె పోస్టర్‌ను ఆదివారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాండు రంగయ్య, జిల్లా సీనియర్ నేత నర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఏడో తేదీ నుంచి నిర్వహించే సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాము, ఎండీ బేగ్, బివై కోటయ్య, వెంకన్న, రాయన్న, మధు, వెంకన్న, బాలునాయక్, అంజయ్య తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నిడమనూరు : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు. నిడమనూరులో సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లు లేని భూమి లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రాధాన్యం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరలంటే గ్రామసభలలో ఎంపిక చేసిన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు కందుకూరి కోటేష్, కొమాండ్ల గురువయ్య, కుంచం శేఖర్, తోటపల్లి బాల నారాయణ, వింజమూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఉంగరం చోరీ చేశాడని ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్ : బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి లిఫ్ట్ ఇచ్చి తన చేతికున్న బంగారు ఉంగరం చోరీ చేశాడని నిడమనూరుకు చెందిన రాపోలు నర్సింహ మిర్యాలగూడ టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. శనివారం పని నిమిత్తం తాను మిర్యాలగూడకు వచ్చానని, దివ్యాంగుడినైన తనకు ఓ వ్యక్తి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి బస్టాండ్‌లో దింపిన అనంతరం తన చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరం లాక్కోని వెళ్లాడని నర్సింహ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి స్థాయి పెంపునకు అడుగులు

- రెండు వందల పడకల స్థాయికి ప్రణాళికలు
- ఇప్పటికే స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే
- ప్రజలకు అందనున్న మెరుగైన వైద్య సేవలు


దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి

దేవరకొండ : దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి స్థాయి పెంపునకు వడి వడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రణాళికలు సైతం సిద్ధం అయినట్లు తెలుస్తుంది. స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రత్యేక చొరవతో దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకల నుండి రెండు వందల పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేసేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఆస్పత్రి స్థాయి పెంపుతో దేవరకొండ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి .ప్రాంతీయ ఆస్పత్రిని రెండు వందల పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఇప్పటికే ఎమ్మెల్యే బాలునాయక్ వైద్యాఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించారు.

రోజు వేయి వరకు ఓపీ నమోదు

దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకల స్థాయి నుంచి రెండు వందల పడకల స్థాయి పెంపునకు స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందుకు గాను ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర,జిల్లా స్థాయి అధికారులతో సమావేశమై ఇక్కడి సమస్యలను తెలియజేశారు. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రికి నిత్యం వైద్య సేవల కోసం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ప్రతి రోజూ దాదాపు 1000వరకు ఓపీ నమోదు అవుతుందంటే ఇక్కడి పరిస్థితి తెలుస్తుంది.అంతేగాకుండా అత్యవసర సమయాల్లో చింతపల్లి, కొండమల్లేపల్లి ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరిగితే ఇక్కడికే వైద్యం కోసం క్షతగాత్రులను తరలిస్తుంటారు. మెరుగైన వైద్యం కోసం తప్పని పరిస్థితుల్లో హైద్రాబాద్, నల్లగొండ వంటి పట్టణాలకు వారిని రెఫర్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. కాగా రెండు వందల పడకల ఆస్పత్రిగా దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి ఏర్పాటైతే అత్యవసర వైద్య సేవలు సైతం అందుబాటులోకి రానున్నాయి.

స్థల పరిశీలన

దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి స్థాయి పెంపునకు అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్ సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి ఇప్పటికే పరిశీలించారు. ఇందుకు సంబంధించి స్థానిక అధికారులు అవసరమైన ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తుంది. ఆస్పత్రి ఏర్పాటుకు గాను పట్టణంతో పాటు పట్టణ శివారులో సైతం అధికారులు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. కాగా త్వరలోనే దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి రెండు వందల పడకల ఆస్పత్రిగా రూపాంతరం చెందనుంది.

మరిన్ని మెరుగైన సేవలు



దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి వంద పడకల నుంచి రెండు వందల పడకల ఆస్పత్రిగా ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు దరి చేరనున్నాయి. ఇందుకు గాను ప్రత్యేక చొరవ చూపుతున్న స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్‌కు కృతజ్ఞతలు.రెండు వందల పడకల ఆస్పత్రి ఏర్పాటయితే అన్ని రకాల వైద్య పరికరాలు,వైద్యులు సైతం అందుబాటులో ఉంటారు.

– రవిప్రకాష్, సూపరింటెండెంట్, దేవరకొండ ఆస్పత్రి

అత్యవసర వైద్య సేవలు అందుతాయి



దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకల స్థాయి నుండి రెండు వందల పడకల స్థాయికి పెంచేందుకు ముమ్మర చర్యలు కొనసాగుతున్నాయి. ఇందుకు గాను ఇప్పటికే సంబంధిత వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహతో పాటు రాష్ట్రస్థాయి అధికారులను కలిసి వివరించా. నిరుపేదలకు వైద్యం అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యం .. ఆస్పత్రి స్థాయి పెంపుతో ఇక్కడి నిరుపేద ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుతాయి.

– నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే, దేవరకొండ

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రవీంద్రకుమార్

చందంపేట : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చందంపేట మండలంలోని ముడుదండ్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన, శ్రీ ముత్యాలమ్మ, ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, ఆంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసాని రాజవర్ధన్‌రెడ్డి, వల్లపురెడ్డి, గోసుల శివ, శ్రీశైలం, జబ్బు తిరుపతయ్య, దామెర శ్రీను, కేతావత్ శంకర్‌నాయక్, సుభాష్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డిండి : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఖానాపూర్‌లో జరిగిన రేణుకా ఎల్ల మ్మ తల్లీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వర రావు, జనార్ధన్‌రావు, కృష్ణారెడ్డి, తులసీరామ్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులున్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే వేసవి శిక్షణ శిబిరాలు


చింతపల్లి మండలం కుర్మపల్లిలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్ఐ యాదయ్య

చింతపల్లి : గ్రామీణ ప్రాంత క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ యాదయ్య ఉన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్మపల్లి హైస్కూల్‌లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ క్రీడలు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువకులు క్రీడాకారులు విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండలం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమం లో మర్రిగూడ ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, చింతపల్లి ఎంఈఓ అంజయ్య,విటి నగర్ హెడమాస్టర్ కృష్ణమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మమ్మ, వాసు దేవా రెడ్డి, హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


కొత్తపల్లిలో వీరబ్రహేంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 23వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం మహోత్సవం ఆదివారం భక్తుల కోలాహలం మధ్య కనుల పండవగా జరిగింది. అర్చకులు బ్రహ్మశ్రీ గౌట్టిముక్కల నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, మండపా రాధన, విఘ్నేశ్వర పూజ, పూర్ణాహుతి, అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, కృష్ణమాచారి, బ్రహ్మానందరెడ్డి, రాము, పరమేష్, సురేష్, జానారెడ్డి, అంజయ్య, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐ టీయూ, బీఆర్టీ, టీయూసీఐ, ఐఎఫ్టీయూ, హెచ్ఎంఎస్, టీఎన్‌టియూసీ, ఏఐటీయూసీ, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాల అసోసియేషన్లు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాకులు మల్లు గౌతం రెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పాపిరెడ్డి, వేణు, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన బోధనతోనే ఉన్నత స్థానాలకు


మాట్లాడుతున్న డైరెక్టర్ రామకృష్ణారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు ఆరో తరగతి నుంచి ఐఐటీ ఫౌండేషన్ బోధన పటిష్టంగా ఉంటేనే ఆ విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారని ద్రోణ స్కూల్ డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, మైనం అనిల్, సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైష్ణవి హోటల్‌లో ద్రోణ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఐఐటీ, నీట్‌పై విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న వయస్సు నుంచి టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని తమ పిల్లలపై విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేసి నప్పటికీ ఇంటి వద్ద కూడా చదవించాలన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటయ్య తదితరులున్నారు.

భగీరథ మహర్షికి నివాళి


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్

నల్లగొండ : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ సమావేశ మందిరంలో మహర్షి భగీరథ చిత్ర పటానికి స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌ను జిల్లా సగర సంఘం ప్రతినిధులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, నెర్లకంటి రవికుమార్, సహాయ బీసీ సంక్షేమ అధికారి గామప్ప, ఎస్తేర, మారయ్య, గంట కృష్ణ, నెర్లకంటి వసంత, బలుగూరి కర్ణాకర్, పెద్ద జంగయ్య, ప్రవీణ్, సుధాకర్, వెంకటేష్, గొల్లూరి యాదయ్య, గంట యాదయ్య, మర్రి శేఖర్, శ్రవణ్, సురేందర్‌లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రామగిరి(నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ మండల కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశములో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ మండల కార్యదర్శి నాలుపరాజు సైదులు పాపయ్య, ఎల్లయ్య, కిరణ్, భిక్షం, వెంకటయ్య, రాములు, పద్మ, లక్ష్మమ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్రిగూడ సీపీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఊట్కూరి నారాయణరెడ్డి. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, కత్తుల యాదయ్య, నల్లబోతు పెద్దులు, బుర్ర లింగయ్య, పిచ్చయ్య, బుచ్చయ్య, శంకర్, ముఖేష్, శివ, శంకర్, గణేశ్, దూదిమెట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెద్దఅడిశర్లపల్లి :గుడిపల్లిలో నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు


హాలియా : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పూర్వ విద్యార్థు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు 42ఏళ్ల తర్వాత ఒక చోట కలుకొని తమ గత స్మృతులను గుర్తు చేసుకొని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు నారెడ్డి బుచ్చిరెడ్డి,శీలం నారాయణరెడ్డి,సముద్రాల మల్లిఖార్జున్ ,నాళ్ల మల్లయ్య,ఎంఈవో సముద్రాల శ్రీనయ్య,ఏకుల శ్రీనివాస్,సీహెచ్ వెంకటయ్య, పూర్వ విద్యార్థులు వర్కాల దామోదర్‌రెడ్డి, జి.దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాలియా : స్థానిక నిర్మల ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మాణిక్యమ్మ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, డోమినిక్, సత్యనారాయణ, కమ్రుద్దీన్, విజయ జ్యోతి, నిర్మలా, లిల్లీ, పూర్వ విద్యార్థులు నల్లగొండ సుధాకర్, సరిత, కె శ్రీనివాస్, రవి, కల్పన, సోమేశ్వర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి కరపత్రం విడుదల


కరపత్రం ఆవిష్కరిస్తున్న యూత్ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకల ప్రచార కరపత్రాన్ని పట్టణంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిలో రెండు సార్లు హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటలకు స్వామివారి శోభాయాత్ర జరుగుతుందన్నారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలిరావాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న బండారి రమేష్

నల్లగొండ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బండారి రమేష్ అన్నారు. నల్లగొండ పరిధిలోని చర్లపల్లిలో 'అమేజింగ్ లైట్ ఆఫ్ గ్రేస్ మినిస్ట్రీస్' చర్చిలో ఆదివారం బాల్యవివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎలీషా నాలో, రేచల్ నాలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర స్వామి జయంతి


బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : బసవేశ్వర జయంతిని నల్లగొండలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బసవేశ్వర భవనాన్ని రిటైర్డ్ ఇంజనీర్ బత్తుల రాజా, మల్లికార్జున ట్రేడర్స్ అధినేత మూల రాజు ప్రారంభించారు. బసవేశ్వర విగ్రహాన్ని డీవీఎం విద్యా సంస్థల అధినేత దొడ్డ శాంతికుమార్ ప్రారంభించారు. బసవేశ్వర చిత్రపటానికి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పటోళ్ల సంగమేశ్వర్, దినేష్ పాటిల్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లపల్లి రాజప్ప, జెట్టి శివకుమార్, ఇమ్మడి పరమేష్, పాగాకు నాగరాజు, ధర్మిశెట్టి కోటి, ఉప్పు శేఖర్, కర్నే వరప్రసాద్, మామిడి ఈశ్వరయ్య, పత్తి వినయ్, వెంబడి లింగప్ప, పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి!

- ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారం
- సక్రమంగా లేని దుకాణాల లెక్కలు
- దృష్టి పెడితే పెరగనున్న ఆదాయం


మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీకి ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రావాల్సిన ఆదాయం భారీగా గండిపడుతుంది. అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతతో ఏళ్లతరబడి ఇదే తంతు సాగుతోంది. అయితే అధికారులు ఏఏ విభాగాల్లో ఎన్ని దుకాణాలు ఉన్నాయో వారికి తెలియని దుస్థితి. మున్సిపాలిటీలో 2020–2021 లెక్కల ప్రకారం మొత్తం 1758 రెన్యువల్‌ను చూపించడం గమనార్హం. ప్రధానంగా కిరాణం, బేకరీ, హోటళ్లు, ఆటో మొబైల్, మద్యం, కార్పెంటర్స్, ఎలక్ట్రీకల్, ఫెలె ఫుడ్, పెయింటింగ్, వస్త్ర, ఐరన్, ఆస్పత్రులతో పాటు పాటు తదితర షాపులకు లైసెన్స్‌లను తీసుకోవాలని, కానీ ఒక్క లైసెన్స్‌లపై రెండు, మూడు షాపపులను నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఒక్కటి తప్పని సరిగా మున్సిపాలిటీ ద్వారా లైసెన్స్‌లను తీసుకోవాలి. కానీ అధికారులల్లో పర్యవేక్షణ లోపం వలన ఎలాంటి అనుమతులు లేకున్నప్పటికీ విచ్చల విడిగా షాపులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మున్సిపాలిటీకి భారీగా ఆదాయం తగ్గుతుంది.

1758మాత్రమే లైసెన్స్ కలిగిన షాపులు

ఆయా వార్డుల్లో వివిధ రకాల షాపులు సుమారు 3 నుంచి 4 వేలకు పైగా ఉండగా అధికారుల లెక్కల ప్రకారం 1758 మాత్రమే లైసెన్స్‌లు కలిగి వ్యాపపారాలను నిర్వహిస్తున్నారు. అయితే నూతనంగా లైసెన్స్‌ల కోసం ప్రస్తుతం 20మంది వరకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తుంది. 1758 లైసెన్స్‌ల ద్వారా ఆదాయ డిమాండ్‌కు గాను రూ.30.60లక్షలు కాగా రూ.29లక్షలు వసూలైనట్లు అధికారులు తెలిపారు. అధికారులు ప్రతి ఏటా ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లపై మాత్రమే దృష్టి సారిస్తూ, ట్రేడల్ లైసెన్స్ ఫీజులపై ప్రత్యేక దృష్టిని పెట్టడం లేదని తెలుస్తుంది. అయితే మున్సిపల్ అధికారులు అనుమతి పొందాలంటే తప్పని సరిగా అనుమతులు తీసుకోవాల్సిందే.

ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా తీసుకోవాలి



వ్యాపారులు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోవాల్సిందే. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లైసెన్స్ ఫీజులను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. లైసెన్స్‌లు లేని వ్యాపారులకు నోటీసులు ఇస్తాం. ట్రేడ్ లైసెన్స్ ద్వారా ఆదాయం పెంచుకుంటాం.

– వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ